పారిశ్రామికవేత్తలు జీఈఎమ్ నమోదు చేసుకోవాలి

పెద్దపల్లిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలు గవర్నమెంట్ ఈ-మార్కెట్ ప్లేస్ (జీఈఎమ్) పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల అధికారి కీర్తికాంత్ సూచించారు. శుక్రవారం ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ముద్ర లోన్స్, ఎమ్ఎస్ఎమ్ఈ ఇతర పథకాలపై మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఈ పోర్టల్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పంచాయతీలు, సహకార సంస్థలు, ప్రైవేట్ రంగం నుంచి వస్తువులు సేవలను పొందవచ్చన్నారు. కొనుగోలు విధానాలలో జీఈఎమ్ ప్లాట్‌ఫామ్ ప్రాధాన్యతను వివరించారు. క్రెడిట్ మేనేజర్ భాస్కర్ యూనియన్ బ్యాంక్ ముద్ర, నారీ శక్తి వివిధ ఎమ్ఎస్ఎమ్ఈ రుణ పథకాలపై అవగాహన కల్పించారు. ఏ.సంతోష్, జి.కిషన్‌లు జీఈఎమ్ రిజిస్ట్రేషన్, బిడ్డింగ్ ప్రాసెస్‌పై అవగాహన కల్పించారు.

నేడు సింగరేణిలో డయల్ యువర్ సీఎండీ

గోదావరిఖని, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదల, రక్షణ, వైద్య సేవల మెరుగుదల వంటి అంశాలపై సింగరేణి చైర్మన్ ఎన్ బలరామ్ శనివారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల కార్మికులు పాల్గొనవచ్చని, సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదల, రక్షణ, వైద్య సేవల పెంపుదలకు నిర్మాణాత్మక సూచనలు, సలహాలను 040-23311338 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించింది.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- గ్రామాల్లో కొరవడిన పారిశుధ్యం
- జిల్లాలో 263 షెడ్ల నిర్మాణం
- లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేశారు



గర్రెపల్లిలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు

సుల్తానాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పెంపునకు ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని గుర్తించింది. అందుకు తడి, పొడి చెత్త వేరు చేసి గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా ఉపాధిహామీ తో పాటు పలు పథకాల నిధులతో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. అయితే లక్ష్యం మేరకు వాటి పనితీరు లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన షెడ్లు చాలా గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి. చెత్త వేరు చేయడం, సేంద్రియ ఎరువుల తయారీ, గ్రామపంచాయతీలకు ఆదాయం సమకూర్చేందుకు ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది. గ్రామాల్లో ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ పారిశుధ్యంపై దృష్టి సారించిన ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు వెచ్చించి మౌలిక వసతులు కల్పించింది. పారిశుధ్య కార్మికుల నియామకం, ట్రాక్టర్ల కొనుగోలు, షెడ్డుల నిర్మాణం తదితర పనులు చేపట్టి, తడిపొడి చెత్తలను వేరుచేసి సేంద్రియ ఎరువుల తయారీకి శ్రీకారం చుట్టింది. ప్రారంభించిన కొద్ది రోజులు సక్రమంగా నడిచిన తరువాత నిరుపయోగంగా మారాయి.

పంచాయతీల పాలకవర్గం గడువు ముగియడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయి. ఆయా గ్రామాలకు నియమితులైన మండల స్పెషల్ అధికారులు పంచాయతీలను సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడం, వ్యవస్థ లోపాలతో పూర్తిగా పనికిరాని నిర్మాణాలుగా మారాయి. ప్రజాధనం వృథా కాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

• లక్ష్యం ఇలా...

గ్రామాల్లో ప్రతీ ఇంటి నుంచి తడిపొడి చెత్త వేరు చేసి సేకరించాలి. తడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసి రైతులకు విక్రయించి గ్రామపంచాయతీలకు ఆదాయం సమకూర్చాలి. అయితే పలు గ్రామాల్లో పారిశుధ్య సిబ్బంది తక్కువ, చెత్త సేకరణకు వాహనాలు లేకపోవడం, రోజువారి

(మిగతా 8వ పేజీలో)

జిల్లాలోని 263 గ్రామ పంచాయతీల్లో నిర్మాణం చేసిన షెడ్లు మూతపడ్డాయి. ఒక్కొక్క షెడ్డుకు రూ.2నుంచి రూ.4 లక్షల నిధులు వెచ్చించారు. జిల్లాలోని మండలాల వారీగా పనులు, నిధుల వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	షెడ్లు	రూపాయలు (లక్షల్లో)
అంతర్గాం	16	40.01
ధర్మారం	29	73.06
ఎలిగేడు	12	32.34
జూలపల్లి	13	33.11
కమాన్‌పూర్	9	22.53
మంథని	32	82.69
మంథని ముత్తారం	14	35.18
ఓదెల	22	56.15
పాలకుర్తి	19	45.08
పెద్దపల్లి	30	75.12
రామగిరి	16	40.26
కాల్వశ్రీరాంపూర్	24	60.01
సుల్తానాబాద్	27	70.31

గ్రామాభివృద్ధి శాఖ ద్వారా షెడ్లను నిర్మించి గ్రామపంచాయతీలకు అప్పగించారు. కొన్నింటిలో గడ్డి పెరిగి పాడుపడ్డాయి. కొన్నింటిలో చెత్తను వేరు చేయకుండా అలాగే చెత్త కుప్పగా డంప్ యార్డులను తలపిస్తున్నాయి.

ఘనంగా పోలి స్వర్గం వేడుకలు



వాగులో దీపాలు వదులుతున్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌మియా వాగులో శుక్రవారం పోలి స్వర్గం వేడుకలు నిర్వహించారు. మార్గశిర మాసం పాడ్యమి తిథి పురస్కరించుకొని పోలి స్వర్గం వేడుకల్లో భాగంగా ఇసుకతో శివలింగాన్ని చేసి పంచామృతాలతో అభిషేకం చేశారు. మంగళహారతులతో పాటలు పాడారు. నది నీటిలో నెయ్యి దీపాలు వెలిగించారు. పోలి స్వర్గానికి పోయిరా అంటూ మహిళలు నమస్కరించారు. అక్కడే సామూహిక భోజనాలు చేశారు. రిటైర్డ్ హెచ్‌ఎంలు రమ రమణారెడ్డి, గంగాభవాని వీరారెడ్డి, రేణుక ప్రసాద్, శారద భూమయ్య దంపతులు, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఏర్పాట్లు



ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ అధికారులు

ధర్మారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నందిమేడారంలో ఈ నెల 26 నుంచి 28 వరకు అండర్ 14 రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం బాలుర వసతిగృహంలో గ్రౌండ్ లెవలింగ్, వాలీబాల్ కోర్టుల మార్కింగ్ చేశారు. ఎంఈవో ప్రభాకర్‌తో కలిసి ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ పరిశీలించారు. ప్రిన్సిపాల్ విద్యాసాగర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, వాలీబాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య, మార్కెట్ కమిటి వైస్‌చైర్మెన్ అరిగె లింగయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, చిరంజీవి, దేవి రమణ, స్వామి, పాల్గొన్నారు.

పెద్దపల్లి డీసీపీగా రాంరెడ్డి



పెద్దపల్లిటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి డీసీపీగా రాంరెడ్డికి శుక్రవారం పోస్టింగ్ ఇచ్చారు. ఆయన ప్రస్తుతం సీఐడీ డీసీపీగా పని చేస్తున్నారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. పెద్దపల్లి డీసీపీగా పని చేస్తున్న కరుణాకర్‌ను డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు.

డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందర్

పెద్దపల్లిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో అట్టర్ ఫ్లాప్ సీఎంగా రేవంత్ రెడ్డి నిలిచాడని, ప్రజల కష్టాల నుంచి దృష్టి మరల్చేందుకే డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర తీశారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి చేస్తున్న డ్రామా అన్నారు. ప్రజలు, మీడియా దృష్టి మరల్చేందుకే రాష్ట్రంలో బీజేపీతో కలిసి కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రెండేళ్ల సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజల్లో దోషిగా నిలబెట్టారని తెలిపారు. దీన్ని జీర్ణించుకోలేక హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్ చేసిన కేటీఆర్‌పై కోడిగుడ్డుపై వెంట్రుకలు పీకినట్లుగా కేటీఆర్‌ను బద్నాం చేయాలనే కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాడన్నారు. గ్రామాల్లోకి వెళితే ఆరు గ్యారెంటీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఒక గొంతు నొక్కితే పదిగొంతులు లేస్తాయన్నారు. అలవికాని హామీలు చేసి ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకే ఫార్ములా ఈ-కార్ రేస్‌ను కేటీఆర్ తీసుకువచ్చారన్నారు. కొద్ది రోజుల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని దెబ్బతీసేందుకు ఇలాంటి కుట్రలకు తెగబడుతున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మాటలతో కాలయాపన చేస్తూ సమస్యలను తప్పుదోవ పట్టిస్తూ రాజకీయం చేస్తున్నారని పేర్కొన్నారు. గోపు ఐలయ్య యాదవ్, ఉప్పు రాజ్‌కుమార్, నారాయదాస్ మారుతి, అడప శ్రీనివాస్, బొండ్ల అశోక్, మెతుకు దేవరాజ్, కృష్ణవేణి, కవిత, సరోజిన, బాదె అంజలి, కనకలక్ష్మీ తదితరులున్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభాలు 8

సైన్స్‌తో నిత్య జీవితంలో సమస్యల పరిష్కారం 8

బయో మెడికల్ వ్యర్థాలను సక్రమంగా డిస్పోజల్ చేయాలి..

- ● మున్సిపల్ వ్యర్థాలలో కలిపితే కఠినచర్యలు
- ● జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ, డీఎంహెచ్‌వో వాణిశ్రీ

జ్యోతినగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బయోమెడికల్ వ్యర్థాలను మున్సిపల్ వ్యర్థాలతో కలిపితే కఠిన చర్యలు ఉంటాయని అదనపు కలెక్టర్ అరుణశ్రీ పలు ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం రామగుండం మున్సిపల్ పరిధిలోని ఆసుపత్రి నిర్వాహకులతో ఎన్టీపీసీలోని ఈడీసీ మిలీనియం హాల్‌లో ప్రభుత్వ ప్రైవేటు డయాగ్నొస్టిక్ సెంటర్లు, డెంటల్ క్లినిక్స్, స్కాన్ సెంటర్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ వ్యర్థాలతో బయోమెడికల్ వ్యర్థాలను కలిపి పారవేయడం వల్ల మున్సిపల్ కార్మికులు ఇన్ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. దీని వల్ల పర్యావరణ కాలుష్యం, ప్రజారోగ్యానికి ముప్పు కలిగిస్తుందని పేర్కొన్నారు. అన్ని ఆసుపత్రులు ఆధీకృత బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీలతో తప్పనిసరిగా టైఅప్ చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా వైద్యాధికారి వాణిశ్రీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆసుపత్రులు ఏజెన్సీతో టైఆప్ చేసుకోవాలని, ప్రభుత్వం జారీ చేసిన గైడ్‌లైన్స్ మేరకు బయో మెడికల్ వేస్టును కలర్ కోడ్ బిన్స్‌లో వేరు చేసి వేయాలని తెలిపారు. సెగ్రిగేషన్ సరిగా చేయకపోతే ఏజెన్సీలు వ్యర్థాలను తీసుకునేందుకు నిరాకరించే అవకాశం ఉందన్నారు.

ఏజెన్సీ వాహనం రాకపోతే, టైఆప్ రెన్యువల్ చేసుకోకపోయినా పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు సమాచారం ఇవ్వాలని, వారు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆసుపత్రుల యాజమాన్యాలు, డాక్టర్లు, ఐఎంఏ సభ్యులు పూర్తి సహకారం అందించాలన్నారు డిప్యూటీ కమిషనర్ కృపాబాయి, బయో మెడికల్ వేస్ట్ ఏజెన్సీ ప్రతినిధి సీష్, ఐఎంఏ అధ్యక్షుడు క్యాసాని శ్రీనివాస్, వైద్యులు లక్ష్మీవేణి, రాపోలు వనజ, దామెర అనిల్ కుమార్, ప్రైవేటు ఆసుపత్రుల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులకు పెన్షన్ ఇవ్వాలి



జెండాను ఆవిష్కరిస్తున్న మత్స్యకారులు

సుల్తానాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 55 ఏళ్లు నిండిన మత్స్యకారులకు ప్రభుత్వం పెన్షన్ అందించాలని మత్స్యకారుల సంఘం మండల అధ్యక్షుడు కుందేల శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గర్రెపల్లిలో జెండాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌కు సంబంధించి చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ఆలస్యం చేశారని, ఆగస్టులో పంపిణీ చేయాల్సిన చేప పిల్లలు ఇప్పటి వరకు రాలేదని దీని వల్ల ఎదుగుదల ఉండదన్నారు. ఒకవేళ ఆలస్యంగా పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టినా నాణ్యమైన పిల్లలను అందించాలని కోరారు. తమ కులాన్ని బీసీ డీ నుంచి ఏ గ్రూప్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షులు లచ్చయ్య, మాజీ ఉప సర్పంచ్ జెట్టి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు సంపత్, కుందేల్ల కనకయ్య, జెట్టి దినేష్, కుందేల్ల మహేష్, కుందేల్ల సంపత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కొలనూర్ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి



ఎంపీ వంశీకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఓదెల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):కొలనూర్ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు హాల్టింగ్ ఇవ్వాలని నాయకులు శుక్రవారం రాత్రి ఎంపీ వంశీ కృష్ణను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కాగజ్‌నగర్, హాజిని, తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. కొలనూరు రైల్వే గేట్ సమీపంలో ఉన్న అండర్ బ్రిడ్జి నుంచి వాహనాలు వెళ్లే విధంగా అనుమతించాలని విన్నవించారు. ఎంపీ వంశీకృష్ణ సానుకూలంగా స్పందించారు. రైల్వే బోర్డు మెంబర్ అనుమాస శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, నాయకులు ఢిల్లీ శంకర్, దొడ్డే శంకర్, సాతురి రవి, ఓయూజేఏసీ నాయకుడు జక్కుల మధు యాదవ్ పాల్గొన్నారు.

మమ్మల్ని ఆదుకోరూ...!

- మాస్టిన్ కళాకారుల వేడుకోలు
- నాడు కథలు చెబుతూ జీవనం
- నేడు ఆదరణ కరువు
- ప్రభుత్వ స్థలం, ఇంటి నిర్మాణం చేపట్టాలి



మాస్టిన్ కులస్తులు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాము ఆర్థిక స్థోమత లేని కూలీలమని, తమకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని మాస్టిన్ కులస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మాస్టిన్ కులస్తులు అంటే గ్రామాల్లో కథలు చెప్పుకొని జీవనం సాగించేవారు. 1978లో మాస్టిన్ కళాకారులు కాల్వశ్రీరాంపూర్‌లో రామాయణం, మహాభారత కథలు ఎంతో అద్భుతంగా అభినయంతో గ్రామస్థులను మెప్పిస్తూ జీవితాలను కొనసాగించే వారు. కాల్వశ్రీరాంపూర్‌లో ఆ సమయంలో చిన్న డేరాలు వేసుకొని కథలు చెప్పుతూ సంచార జీవనం సాగించేవారు. మాజీ ఎమ్మెల్యే కాల్వరామచంద్రారెడ్డి కాల్వశ్రీరాంపూర్ సర్పంచ్‌గా ఉన్న సమయంలో సర్వే నెంబర్ 7లో ఒక్కొక్క కుటుంబానికి రెండు గుంటల భూమి చొప్పున 8 కుటుంబాలకు ప్రభుత్వభూమి అందించి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయించారు. వీరంతా ఊరురా తిరిగి కథలు చెప్పుకుంటూ కాల్వశ్రీరాంపూర్‌లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు.

ప్రస్తుతం గ్రామీణ కళలు అంతరించిపోవడంతో వారు జీవనభృతి కోసం కూలీ చేసుకుంటూ జీవిస్తున్నారు. ప్రస్తుతం 10 నుండి 80 కుటుంబాలు ఇక్కడ ఏర్పడ్డాయి. వారి జనాభా పెరగడంతో ఇళ్లు కట్టుకోవడానికి స్థోమత లేకపోవడంతో ప్రస్తుతం గుడిసెల్లో ఉంటున్నారు. గతంలో ఇళ్ల స్థలాల కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టు తిరిగినా ప్రయోజనం లేదు. గత ప్రభుత్వం వారికి తారుపల్లి గ్రామంలో ఒక్కొక్కరికి గుంట చొప్పున ప్రభుత్వ భూమి కేటాయించి అధికారులు వారికి పట్టాలు కూడా జారీ చేశారు. దీంతో వారు తారుపెల్లి గ్రామంలో ఉండటానికి వెళ్లితే అక్కడి గ్రామస్థులు భూమి ఇవ్వడానికి నిరాకరించారు. తమ గ్రామానికే భూమి దక్కాలని వారు పేర్కొనడంతో మాస్టిన్ కులస్తులు ఒక్కతాటిపైకి వచ్చారు. దీంతో వారంతా పాండవుల గుట్ట సమీపంలో మండల కేంద్రంలోని 597 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిని ఇటీవల చదును చేశారు. ఈ సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిని గతంలో తహసీల్దార్లు బడా వ్యాపారులు, పలుకుబడి గల గ్రామస్తులకు అక్రమంగా పట్టాలు ఇచ్చారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో మాస్టిన్ కులస్తులు తమకు ప్రభుత్వ భూమిలో ఉండేందుకు ఇంటి జాగా ఇవ్వాలని, స్థలాన్ని కూడా శుభ్రం చేసుకొని డేరాలు వేసుకున్నారు. రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ క్రమంలో వారు ఎమ్మెల్యే విజయరమణరావును కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే వారికి ఇంటి జాగా విషయంలో సానుకూల సంకేతాలు ఇచ్చారు. కడు పేదరికంలో ఉన్న తమకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలని వారు కోరుతున్నారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్ ఈ విషయంలో ఎమ్మెల్యేకు వారి దీనస్థితిని వివరించారు.

వర్షం వస్తే గుడిసెలకు నీళ్లు వస్తున్నాయి

- బుద్దుల తార, కాల్వశ్రీరాంపూర్



కూలీ చేస్తేనే మాకు మా పిల్లల కడుపు నిండేది. మాకు గుంట వ్యవసాయ భూమి లేదు. గుడిసె వేసుకొని జీవిస్తున్నాం. అధిక వర్షాలు పడితే గుడిసెల్లోకి నీళ్లు వస్తున్నాయి. ప్రభుత్వం మాకు జాగ ఇచ్చి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి.

జాగా చూపించి ఇల్లు మంజూరు చేయాలి

- దంతనపల్లి లక్ష్మి, కాల్వశ్రీరాంపూర్



ప్రభుత్వం జాగా చూపించి, ఇల్లు మంజూరు చేయాలి. ఇల్లు లేక మేము మా పిల్లలం ఎంతో ఇబ్బంది పడుతున్నాం. ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకున్నాం. మమ్మల్ని ఎవరు పట్టించుకోవడం లేదు. గుంట భూమి లేని మేము కాయకష్టం చేసి బతుకుతున్నాం. ప్రభుత్వం మమ్ములను ఆదరించాలి.

సమస్యలను పట్టించుకునే వారే లేరు

- దంతనపల్లి స్వామి, మాస్టిన్ కుల సంఘం రాష్ట్రఅధ్యక్షుడు



మాస్టిన్ కులసమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారు. కాల్వశ్రీరాంపూర్‌లోని 185 సర్వే నెంబర్‌లో గతంలో భూమి ఇచ్చారు. హద్దులు చూపించలేదు. తారుపల్లిలో ఇల్లు జాగా ఇచ్చినా గ్రామస్తులు అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమి 597 సర్వే నెంబర్‌లో మా కులస్తులకు రెండు గుంటల జాగా ప్రభుత్వం ఇచ్చి ఇల్లు నిర్మించాలి.

రాజన్న ఆలయ విస్తరణ పనుల అడ్డగింత

● రహదారి విస్తరణపై స్పష్టత ఇవ్వాలని ఇళ్ల యజమానుల డిమాండ్



ఆలయ విస్తరణ పనులను అడ్డుకుంటున్న ఇళ్ల యజమానులు

వేములవాడ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులను శుక్రవారం ఇళ్లు, దుకాణాల యజమానులు అడ్డుకున్నారు. భారీ క్రేన్‌తో పనులు చేస్తుండగా ఎదురుగా ఉన్న ఇళ్ల యజమానులు తరలివచ్చి పనులు అడ్డుకున్నారు. దీంతో ఆలయ అధికారులతో ఇళ్లు, దుకాణాల యజమానులు చర్చకు దిగారు. ఆలయ దక్షిణం వైపు ప్రధాన రహదారిని ఏ మేరకు విస్తరణ ప్రతిపాదనలు ఉన్నాయో తెలియజేయాలని పట్టుబట్టారు. రహదారిపై విస్తరణ పనులు రావడంతో రోడ్డు చిన్నదిగా మారి నివాసాలు కోల్పోతామని, రహదారి ఎన్ని అడుగులు ఉండాలో ముందుగానే నిర్ణయించాలని యజమానులు డిమాండ్ చేశారు. విస్తరణ పనులకు ముందే తమకు నోటీసులు జారీచేసిన తర్వాతే పనులు ప్రారంభించాలని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా పనులు చేపడుతారని అభ్యంతరం వ్యక్తం చేశారు.

● స్థానికులలో అభద్రతాభావం తొలగించాకే పనులు ప్రారంభించాలి

- బీజేపీ సీనియర్ నాయకుడు ప్రతాప రామకృష్ణ

స్థానికులలో అభద్రతాభావం తొలగించాకే పనులు ప్రారంభించాలని బీజేపీ సీనియర్ నాయకులు ప్రతాప రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆలయ విస్తరణ పనులు అడ్డుకన్న సందర్భంగా అధికారులతో చర్చించారు. ఎన్ని అడుగులు రోడ్డు వేస్తారో తెలియజేశాకనే ఆలయ దక్షిణ ప్రాకారం విస్తరణ పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. విస్తరణ పనులతో రోడ్డు, స్థలం పక్కనే ఉన్న ఇండ్లు ఎన్ని కోల్పోతామనే విషయంలో స్థానికులు ఆందోళనతో ఉన్నారన్నారు. ముందస్తు సమాచారం లేకుండా పనులు ప్రారంభించడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

భీమేశ్వరాలయంలో సౌకర్యాలు



- రాజన్న భక్తులకు తొలగనున్న ఇబ్బందులు
- క్యూలైన్‌లో బెంచీల ఏర్పాట్లు
- నిఘా నీడలో ఆలయం



కోడెల క్యూలైన్‌లో ఏర్పాటు చేసిన స్టీల్ బెంచ్‌లు

వేములవాడ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం క్యూలైన్‌లలో బెంచీలు సిద్ధమవుతున్నాయి. రాజన్న సన్నిధిలోని ఉన్న క్యూలైన్‌లన్నీ తొలగించి భీమన్న సన్నిధికి మార్చేస్తున్నారు. భీమేశ్వరాలయంలోకి భక్తులు వెళ్లేందుకు వీలుగా ఇనుప క్యూలైన్‌లతో పాటు స్టీల్ ఫర్నీచర్‌ను సమకూర్చుతున్నారు. కోడెల మొక్కులు, సర్వదర్శనం, బ్రేక్ దర్శనానికి పక్కపక్కనే మూడు క్యూలైన్‌లను ఏర్పాటుచేశారు. ఏ దర్శనానికి వెళ్లే భక్తులు ఆ క్యూలైన్‌లలో వెళ్లేందుకు వీలు కల్పించారు. ఆలయంలో రద్దీగా ఉన్న సమయంలో చంటిపిల్లలను ఎత్తుకొని వచ్చే మహిళలు, భక్తులు క్యూలైన్‌లలో గంటల తరబడి నిలడాల్సి వస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న అధికారులు క్యూలైన్‌లలో స్టీల్ బెంచీలను అమర్చుతున్నారు. భక్తులు నిలబడే ఇబ్బంది తప్పుతుంది. మరోవైపు క్యూలైన్‌లు రహదారికి అడ్డంగా ఉండడంతో ఫ్లైఓవర్‌ను నిర్మించి భక్తులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

● నిఘా నీడలో భీమేశ్వరాలయం

భీమేశ్వరాలయాన్ని పూర్తిస్థాయిలో నిఘా నీడలోకి తీసుకువస్తున్నారు. భీమేశ్వర గర్భాలయం, ఆలయ ఆవరణ, బయట క్యూలైన్‌లు, ముఖ్య బుకింగ్ కౌంటర్, ప్రసాదాల కౌంటర్, భీమేశ్వర సదన్, ఇతర ప్రాంతాల్లో దాదాపు 72 సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో 32 కొత్త కెమెరాలు కాగా మిగతా 40సీసీ కెమెరాలు రాజన్న సన్నిధి నుంచి తీసుకువచ్చి భీమన్న సన్నిధిలోకి మార్చుతున్నారు. ప్రస్తుతం భీమన్న గర్భాలయంలో ఏర్పాటుచేసిన 32 సీసీ కెమెరాలు ప్రారంభమయ్యాయి. మిగతా 40 సీసీ కెమెరాలు నాలుగురోజుల్లో ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నారు. దీంతో ఆలయం అంతటా నిఘా ఉంటుంది.



సీసీ ఫుటేజీల స్క్రీన్

● భీమన్న సన్నిధిలో కమాండ్ కంట్రోల్ రూం

భీమేశ్వరాలయంలో భక్తుల ఇబ్బందులను గమనించేందుకు కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేకంగా భక్తులు బయటకు వెళ్లే ప్రాంతంలో ఒక గదిని నిర్మిస్తున్నారు. సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించేందుకు నిరంతరం ఒక ఉద్యోగి ఉండేవిధంగా ఏర్పాట్లు చేశారు.

కుటుంబంపై దాడి.. నలుగురిపై కేసు



చికిత్స పొందుతున్న వీరగోని శివ

సైదాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామంలో ఓ ఇంటిపై దాడి చేసి కుటుంబసభ్యులను గాయపర్చిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేశారు. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం... గురువారం ఉదయం సోమారం గ్రామానికి చెందిన వీరగోని శ్రీనివాస్ ఇంటిపై అదే గ్రామానికి చెందిన లోకిని రాజయ్య, లోకిని మహేష్, లోకిని కుమార్ దాడి చేశారు. కుటుంబసభ్యులను చితకబాదారు. ఆ గొడవలో వీరగోని శివకు తీవ్ర గాయాలయ్యాయి. అస్వస్థతకు గురై స్పృహకోల్పోవడంతో హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిచికిత్స అందిస్తున్నారన్నారు. అదే గ్రామానికి చెందిన వీరగోని మహేదంర్ అనేవ్యక్తి రాజయ్య, మహేష్, కుమార్‌ను రెచ్చగొట్టి గొడవ అయ్యేలా చేశాడని, వారితోపాటు గొడవను ప్రోత్సహించిన మహేందర్‌పై చట్టపరమైనచర్యలు తీసుకోవాలని వీరగోని శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడని, దీంతో శుక్రవారం నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతి తెలిపారు. మరోవైపు మహేందర్ విలేకరినని చెప్పుకుంటూ గ్రామంలో గొడవలు సృష్టిస్తున్నాడని, చర్యలు తీసుకోవాలని సుమారు 30మందికిపైగా గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

జ్యోతినగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతమ్‌నగర్ సమీపంలోని రైల్వేట్రాక్‌పై తిరిగిది శ్యాముల్ (21) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గౌతమ్‌నగర్‌కు చెందిన శ్యాముల్ ఐటీఐ చదువుకోగా చెడువ్యసనాలకు బానిసగా మారాడు. ఈ క్రమంలో గురువారం శ్యాముల్ తల్లితండ్రులు ఏదైనా పని చేసుకోవాలని, చెడుమార్గాల వైపు వెళ్లవద్దని మందలించారు. దీంతో మనస్తాపానికి గురై శుక్రవారం సింగరేణి నుంచి ఎన్టీపీసీకి బొగ్గు సరఫరా చేసే రైల్వేట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కొండలరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

చిగురుమామిడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డుప్రమాదల్లో ఇద్దరు మృతి చెందారు. స్థానిక ఎస్సై సాయికృష్ణ వివరాలప్రకారం.. మండలంలోని గాగిరెడ్డిపల్లికి చెందిన దొంతరవేణి విజయ్(22) సుందరగిరి నుంచి హుస్నాబాద్‌కు బైక్‌పై తన స్నేహితుడితో అతివేగంగా వస్తున్నాడు. బైక్ అదుపుతప్పి చెట్ల పొదల్లోకి వెళ్లింది. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

మండలంలోని సుందరగిరికి చెందిన గాండె రాజయ్య(69) వ్యవసాయ పనులను ముగించుకొని ఎక్సెల్‌పై వస్తున్నాడు. వెనుకనుంచి ట్రాక్టరు ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమ్మిత్తం అతన్ని స్థానికులు 108అంబులెన్స్‌లో హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీశీలించి అప్పటికై మృతిచెందినట్లు తెలిపారని ఎస్సై వివరించారు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి రిమాండ్

ధర్మపురి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాలపల్లె గ్రామంలో మాడూరి లత అనే మహిళపై హత్యాయత్నం చేసిన కేసులో భర్త మాడూరి తిరుపతిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గత జూన్ నెలలో భర్త మాడూరి తిరుపతిని మద్యం తాగవద్దని భార్య మందలించిందని ఆయన పేర్కొన్నారు. ఆమెపై కోపం పెంచుకొని ఇంట్లో ఎవరు లేని సమయంలో తిరుపతి కత్తితో భార్య లతను కడుపులో పొడిచి ముంబాయికి పారిపోయాడని ఆయన తెలిపారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడు తిరుపతిని శుక్రవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపించినట్లు ఆయన వివరించారు.

బాలిక అదృశ్యం

కొడిమ్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మయ్యపేట గ్రామానికి చెందిన 17ఏళ్ల బాలిక తెనుగొండ తిరుమల అదృశ్యం అయినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ శుక్రవారం రాత్రి తెలిపారు. ఎస్సై తెలిపినవివరాల మేరకు మండలంలోని దమ్మయ్యపేట గ్రామానికి చెందిన బాలిక ఈనెల20న రాత్రి ఎవ్వరికి చెప్పకుండ ఇంటి నుంచి పోయినట్లు బాలిక తల్లి తెనుగొండ దేవక్క పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కూతురు ఇంటికి రాకపోవటంతో ఆమె గురించి చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదని తెలిపారు. బాలిక ఇంటి నుంచి వెళ్లేటప్పుడు బూడిద రంగు పంజాబీ డ్రెస్స్, నలుపురంగు పాయింట్ ధరించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ సెల్‌నంబరు 8712656831 నెంబరుకు కాల్ చేయాలని సూచించారు.

విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధం

మానకొండూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ గ్రామంలో ట్రాక్టర్‌లో పశుగ్రాసం తీసుకవస్తుండగా విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధమైంది. గ్రామానికి చెందిన కందుల మొగిలి పశుగ్రాసం కట్టలను శుక్రవారం ట్రాక్టర్‌లో తీసుకవస్తున్నారు. గ్రామశివారులో విద్యుత్ తీగలు తగిలి గడ్డికట్టలకు మంటలు అంటుకున్నాయి. రోడ్డు వెంట వెళ్లే వారు గమనించి ట్రాక్టర్ డ్రైవర్‌కు తెలిపారు. దీంతో కాలుతున్న పశుగ్రాసం కట్టలను డ్రైవర్ కిందికి తోసేశాడు. ట్రాక్టర్‌లోని పశుగ్రాసం పూర్తిగా కాలి బూడిదైయింది. దీంతో ట్రాక్టర్‌కు, డ్రైవర్‌కు ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.



దగ్ధమైన పశుగ్రాసం

కార్తీకమాసం ఆదాయం రూ. 8.22కోట్లు

వేములవాడ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం కార్తీకమాసం ఆదాయం రూ.8.22 కోట్లు సమకూరిందని ఈవో రమాదేవి తెలిపారు. కార్తీకమాసం అక్టోబరు 22న ప్రారంభమై ఈనెల20న ముగిసింది. ఈ సందర్భంగా లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని కానుకలు సమర్పించారు. ఇందులో ఆర్జిత సేవలు, ఇతర టికెట్ల ద్వారా రూ. 4కోట్లు, హుండీల ద్వారా రూ.4.22కోట్ల ఆదాయం వచ్చిందని ఆమె తెలిపారు.

ఎలుగుబంటి కదలికలు ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలి

ఇల్లంతకుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొన్ని ప్రాంతాలలో ఎలుగుబంటి కదలికలు ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్ సూచించారు. మండలంలోని వంతడుపుల గ్రామంలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలుగుబంటి ఉదయం, సాయంత్రం వేళల్లో సంచరిస్తుందన్నారు. ఎలుగుబంటి వ్యవసాయ క్షేత్రాల వద్ద కనిపిస్తే పారిపోకుండా శబ్దం చేయాలన్నారు. ఎలుగుబంటి కళ్లలోకి నేరుగా చూడకుండా నెమ్మదిగా వెనుకకు వెళ్లాలన్నారు. ఎక్కువ మంది వెళ్లడం ద్వారా ఎలుగుబంటి పారిపోతుందన్నారు. సమావేశంలో అటవీశాఖ ఉద్యోగులతో పాటు రైతులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

ధర్మారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని మైన్స్, జియాలజిశాఖ సహాయ సంచాలకుడు పి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ధర్మారం మండలంలో అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్న లారీతో పాటు కార్‌ను సీజ్‌చేశారు. నిబంధనలకు లోబడి అనుమతి తీసుకుని మాత్రమే ఇసుక రవాణా చేయాలని హెచ్చరించారు.

ఏడాదిన్నర తర్వాత వీడిన మిస్టరీ

● హత్య కేసులో ఆరుగురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీపీ గౌస్ ఆలం



మృతుడు దినేష్(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కవ్వంపల్లి దినేష్(40) హత్యకేసులో పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. ఏడాదిన్నర క్రితం కవ్వంపల్లి దినేష్ మృతదేహం చొప్పదండి శివారులోని కెనాల్‌లో లభ్యమవడంతో చొప్పదండి పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. ఆ సమయంలో మృతుడికి సంబంధించిన వివరాలు లేకపోవడంతో విచారణ ముందుకు సాగలేదు. గతంలో గంగాధరలో ఒక వృద్ధురాలిని హత్య చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసిన సందర్భంలో దినేష్ హత్యకు సంబంధించిన కొంత సమాచారం పోలీసులకు తెలిసింది. దీంతో హత్యకు గురైన దినేష్ కేసులో నిందితులు పోలీసులకు చిక్కారు. శుక్రవారం పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం కార్యాలయంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మల్కాపూర్ గ్రామానికి చెందిన నిందితుడు దేవునూరి సతీష్‌కు, అదే గ్రామానికి మృతుడు కవ్వంపల్లి దినేష్‌కు మధ్య భూమి అమ్మకం విషయంలో గొడవలు ఉన్నాయి. మరోవైపు దేవునూరి సంతోష్ ఒక మహిళతో సన్నిహితంగా ఉంటున్న విషయంపై మృతుడు దినేష్ చంపుతానని పలు మార్లు బెదిరించాడు. దీంతో సంతోష్ తన అన్న దేవునూరి శ్రావణ్‌కు విషయం చెప్పగా, దినేష్‌తో ముప్పు ఉందని అంతమొందించాలని వారు నిర్ణయించుకున్నారు. దినేష్ హత్యకేసులో ప్రధాననిందితుడు మల్కాపూర్‌కు చెందిన దేవునూరి సతీష్(30) తోపాటు దేవునూరి శ్రావణ్(28), దేవునూరి రాకేష్(24), మోతెకుచెందిన కుమ్మరి వికేష్(26), మల్కాపూర్‌కు చెందిన జంగ చిన్నారెడ్డి(25), దేవునూరి సంతోష్(28)ను అరెస్టు చేశామని సీపీ వివరించారు. హత్య మిస్టరీని ఛేదించిన పోలీసులను సీపీ అభినందించారు.

రౌడీషీటర్ అరెస్టు



నితిన్ వర్ధన్ అరెస్టును చూపుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీ షీటర్ తిరుపతి నితిన్ వర్ధన్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన తిరుపతి నితిన్ వర్ధన్ నగరంలోని వన్ టౌన్, టూటౌన్, త్రీ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్‌లలో పలు కేసులలో నిందితుడిగా ఉన్నాడు. తిరుపతి నితిన్ వర్ధన్‌పై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఓపెన్ చేశారు. 2024లో నిందితుడిపై రెండు తగాదా కేసులు నమోదు అయ్యాయి. భూకబ్జా, బెదిరింపులు, భూమి రిజిస్ట్రేషన్ చేస్తానని మోసం చేసిన కేసుల్లో పరారీలో ఉన్నాడు. పోలీసులకు చిక్కకుండా పలు ప్రాంతాల్లో తిరుగుతూ పోలీసులకు పట్టుబడ్డాడు.

పాఠశాల ప్రాంగణంలో నాగుపాము



పామును చంపుతున్న యువకుడు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, అంగన్‌వాడీకేంద్రం ప్రాంగణంలోని పరిసరాల్లో శుక్రవారం నాగుపాము ప్రత్యక్షమవడం కలకలం రేపింది. అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోకి నాగుపాము రావడంతో చిన్నారులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన అంగన్‌వాడీ సిబ్బంది స్థానికులకు సమాచారం అందించారు. గ్రామంలోని యువకుడు రవి చేరుకుని నాగుపామును చంపేయడంతో ఊపిరిపీల్చుకున్నారు. వ్యవసాయ పంట పొలాలకు సమీపంలో పాఠశాల, అంగన్‌వాడీకేంద్రం ఉండడం వల్ల పాములు సంచారిస్తున్నాయని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పేర్కొన్నారు. పరిసరాల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం లేకుండా చర్యలు చేపడుతున్నామని వివరించారు.

శివాలయం హుండీ చోరీ

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడిపల్లి గ్రామంలోని శివాలయంలో హుండీని గుర్తుతెలియని దొంగలు పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. మడిపల్లి గ్రామపరిధిలోని హుస్సేన్ మియా వాగులో శివాలయం నిర్మించారు. ఆ గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామస్థులు ఇక్కడ స్నానాలు చేసి శివయ్యను దర్శించుకుంటారు. భక్తులు వారికితోచిన కానుకులు సమర్పించుకుంటారు. గురువారం రాత్రి దొంగలు హుండీ పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. శుక్రవారం గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోతకు వచ్చిన వరిని కోసుకుపోయారు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన రైతు అన్నారపు రవీందర్ 23 గుంటల్లో వరి పంట సాగు చేశాడు. ఓదెల మండలం ఇందుర్తి, బాయమ్మపల్లెకు చెందిన వారు అక్రమంగా 23 గుంటల్లో వేసిన వరిలో 12 గుంటల వరిని కోసి ట్రాక్టర్‌లో పట్టుకుపోయినట్లు బాధితుడు వాపోయాడు. చుట్టుపక్కల పొలాలు ఉన్న రైతులు తమకు సమాచారం ఇవ్వడంతో తాము పొలం వద్దకు రాగానే అప్పటికే వారు వరికోసి కుప్పవేసి పట్టుకొని పోయినట్లు రైతు రవీందర్ తెలిపారు. అప్పు విషయంలో కోసుకుపోయారని అంటున్నారని, తాను ఎలాంటి అప్పులేనని రైతు పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని ఆయన అధికారులను వేడుకుంటున్నాడు. పంట కోతకు వచ్చిందని రైతు సంబరపడిన లోపే అక్రమంగా కోసుకుపోయారంటూ బాధిత రైతు తన ఆవేదనను తెలిపాడు.

పోలీసుల విస్తృత తనిఖీలు



మల్యాల అంగడిబజారులో పోలీసుల గస్తీ

మల్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మల్యాలతో పాటు కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో మల్యాల ఎస్సై ఎ నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల పలు చోట్ల బాంబు పేలుళ్ల నేపథ్యంలో జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు అంగడిబజారు, మార్కండేయ ఆలయ ప్రాంతం, కొండగట్టులో డాగ్‌స్క్వాడ్, బాంబు స్క్వాడ్ బృందాలు దుకాణాలు, రహదారులను తనిఖీలు చేపట్టారు. అనంతరం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం, పరిసరాలు కూడా తనఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, నేరాలకు సంబంధించి ఇతరాత్ర ఏమైన దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు సూచించారు.

● చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

వెల్గటూర్: చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఉదయ్ కుమార్ హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, వెల్గటూర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఎవరూ ఎలాంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొన కూడదని అన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొడుకు పోషించడం లేదని..

● పోలీసులను ఆశ్రయించిన వృద్ధురాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎల్లవ్వ

చందుర్తి నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామానికి చెందిన 80 ఏళ్ల ఆది ఎల్లవ్వ అనే వృద్ధురాలు కుమారుడు పోషించడం లేదని శుక్ర వారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎల్లవ్వ భర్త కాశయ్య కొన్ని సంవత్సరాలక్రితం మృతిచెందాడు. అతడి పేరు మీద ఉన్న నాలుగు ఎకరాల భూమితో పాటు ఇల్లును తమ కుమారుడు కిషన్ తనపేరుపై భూమి పట్టా చేసుకొని, ఇల్లును కూడా ఇతరులకు విక్రయించాడని పేర్కొంది. అప్పటినుంచి తనను పోషించకుండా, పోషణకు డబ్బులు ఇవ్వడం లేదని, న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరింది. ప్రస్తుతం ఎల్లవ్వ అనారోగ్యంతో ఉండడంతో ఆమె ఇద్దరు కూతుళ్ల దగ్గు దేవేంద్ర, మంతెన లక్ష్మిలు కొన్ని సంవత్సరాలుగా దగ్గరుండి చూసుకుంటున్నారన్నది. ప్రస్తుతం అనారోగ్యంతో ఉండడంతో కూతుళ్ల తనను వేములవాడలోని ఏరియా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నరని తెలిపారు. ఈనెల 17 జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు ప్రతి నెల పోషణ భత్యంతో పాటు, తన పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ ఇప్పించి న్యాయం చేయాలని పోలీసులను కోరింది. ఎల్లవ్వ ఫిర్యాదుతో ఆమె కుమారుడు కిషన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

బాల్య వివాహాలను నిరోధించడం అందరి బాధ్యత



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న సాధికారిత కోఆర్డినేటర్లు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని బండారికుంట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో సాధికారిత కేంద్ర కోఆర్డినేటర్ దయా అరుణ, జెండర్ స్పెషలిస్ట్ సుచరిత మాట్లాడుతూ బాల్యవివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వారు వివరించారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. అనంతరం పలువురు మహిళల చేత బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. హెల్ప్‌లైన్ నెంబర్ల గురించి మహిళలకు వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు సుజాత, రేఖ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

- ఉద్యోగులకు అరకొర వేతనాలు
- ఎనిమిదేళ్లుగా అందని ఇంక్రిమెంట్లు
- వాహనాల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు
- అంబులెన్స్‌ల నిర్వహణపై ఆందోళన



సమస్యల వలయంలో సంచార పశు వైద్యం

జగిత్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పశువులకు ఇంటి వద్ద వైద్యం అందించడానికి ఏర్పాటు చేసిన సంచార పశు వైద్య వాహన సేవలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. పశువుల ఆరోగ్యాన్ని కాపాడడం, వ్యాధుల నివారణ, కృత్రిమ గర్భధారణ వంటి సేవలతో పాటు అత్యవసర వైద్య సేవలు అందించడం లక్ష్యంగా సంచార పశు వైద్య వాహనాలను రాష్ట్రంలో 2017 సంవత్సరంలో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున పనిచేస్తున్నాయి.

• సక్రమంగా అందని వేతనాలు

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 100 సంచార పశు వైద్య వాహనాలు పనిచేస్తున్నాయి. ఒక్కో వాహనంలో ఒక పశు వైద్యుడు, పశు వైద్య సహాయకుడు, డ్రైవర్, హెల్పర్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 400 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంచార పశు వైద్య వాహనాల్లో పనిచేస్తున్నారు. డాక్టర్‌కు రూ.35 వేలు, సహాయకుడికి రూ.19,500, డ్రైవర్‌కు రూ.15,500 వేలు, హెల్పర్‌కు రూ.9 వేలు వేతనం ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా అందిస్తున్నారు. అయితే ఉద్యోగుల వేతనాల్లో ఏజెన్సీ నిర్వాహకులు వివిధ కారణాల పేరిట కోతలు విధిస్తున్నట్లు వారు వాపోతున్నారు. అర కొరగా అందించే వేతనాలు సైతం మూడు, నాలుగు నెలలకు ఒకసారి అందిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రెండు నెలల వేతనం పెండింగ్‌లో ఉందంటున్నారు. ఉద్యోగులకు ప్రతీ యేటా 10 శాతం ఇంక్రిమెంట్లు ఇవ్వాల్సి ఉండగా ఎనిమిది సంవత్సరాలుగా అందడం లేదని వాపోతున్నారు.

• అంతంతమాత్రంగానే మందులు

ఆయా గ్రామాల్లో పశువులకు సమస్యలు వచ్చినా, వ్యాధులు సోకినా 1962 నంబరుకు కాల్ చేయగానే వీరు గ్రామానికి మందులతో వెళుతారు. సదరు పశువుకు రైతుల ఇళ్ల వద్దే చికిత్స అందిస్తారు. కొన్ని నెలలుగా పశువుల చికిత్సకు అవసరమైన మందులు సరఫరా చేయడం లేదంటున్నారు. ప్రభుత్వ పశు వైద్యశాలల్లో అందుబాటులో ఉన్న మందులను సేకరించి వైద్యం చేయాల్సి వస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు. సంచార పశు వైద్య వాహనాల నిర్వహణలో వస్తున్న ఇబ్బందులు, సకాలంలో వేతనాలు అంద జేత, ఇంక్రిమెంట్లు తదితర సమ స్యలు పరిష్కరించాలని కోరుతు న్నారు.

● ఈ విషయమై జగిత్యాల జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ ప్రకాశ్ మాట్లాడుతూ సంచార పశు వైద్య వాహనసేవలు అందించే బాధ్యతను ప్రభుత్వం ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించిందన్నారు. ఉద్యోగుల వేతనాలు, వాహనాల నిర్వహణ ఏజెన్సీ పరిధిలో ఉంటుందన్నారు.

సంచార పశు వైద్యాన్ని పటిష్టం చేయాలి

-బోడ రాజేందర్, పశు పోషకుడు, తిమ్మాపూర్ గ్రామం, జగిత్యాల జిల్లా



సంచార పశు వైద్య వాహన సేవలను ప్రభుత్వం మరింత పటిష్టం చేయాలి. పశువుల చికిత్సకు అవసరమైన మందులను సరఫరా చేయాలి. పాడి రైతులకు ఆర్థికభారం పడకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. వాహన మరమ్మతులు చేయించాలి.

ప్రభుత్వ నిర్ణయంపైనే ఆశలు

-మచ్చర్ల గణేష్, రాష్ట్ర అధ్యక్షుడు, సంచార పశు వైద్య శాల ఉద్యోగుల సంఘం



రాష్ట్రంలో గల సంచార పశు వైద్య శాలలో పనిచేస్తున్న ఉద్యోగులు, వాహనాల నిర్వహణ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉంది. ఇటీవల సమస్యలను విన్నవిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీతో పాటు పశు సంవర్థక శాఖ అడిషనల్ డైరెక్టర్లను కలిసి వినతిపత్రాలను అందించాం.

ప్రిన్సిపాల్‌ను అభినందించిన స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్



ప్రిన్స్‌పాల్‌ను అభినందిస్తున్న నవీన్ నికోలస్

ధర్మారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వినూత్న ఆలోచనలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్న ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్‌కుమార్‌ను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ నికోలస్ ప్రశంసించారు. పాఠశాలలో అన్ని రకాల వసతులతో పాటు మంత్లీ మ్యాగజైన్, రేడియో ఎఫ్‌ఎం, మీల్స్ విత్ స్టూడెంట్స్, ప్లాస్టిక్ రహిత పాఠశాల, ప్లే ఫర్ ఆల్, స్టూడెంట్స్ పోలీస్ క్యాడెట్, ఆదర్శ ఇంటి బాట వంటి కార్యక్రమాలతో విద్యను అందిస్తున్నారు. ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న ప్రత్యేకమైన కార్యక్రమాల గురించి తెలుసుకున్న ఎడ్యుకేషన్ కమిషనర్ శుక్రవారం రాజ్‌కుమార్‌కు హైదరాబాద్ కార్యాలయంలో ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

రాయికల్, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): రాయికల్ మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని తుంగతుర్తి సంజన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఎస్‌జీఎఫ్-69వ పోటీల్లో భాగంగా అండర్-17బాలికల నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాల స్థాయి నుంచి నల్లగొండలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థిని శాలువాకప్పి సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మిట్టపల్లి మహేష్ రెడ్డి, డైరెక్టర్ కాకర శ్రీనివాస్ రెడ్డి, హెచ్‌ఎం రాజేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకురాలు

మల్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఎస్ రేవతి అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. ఉమ్మడిజిల్లా స్థాయి పోటీలలో ప్రతిభచాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. నూకపల్లిలో ప్రతిభ స్కూల్ విద్యార్థి శౌర్యరామ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక అయినట్లు కరస్పాండెంట్ అమీర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, పీఈటీలు శ్రీనివాస్, నవీన్, సాయి, సింధూజ, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీరాంసాగర్‌కు 3,338 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గింది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 3,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

● కరీంనగర్ సీపీ గౌస్ ఆలం



రాజీవ్ రహదారిపై బ్లాక్ స్పాట్‌లను పరిశీలిస్తూ సూచనలు చేస్తున్న సీపీ గౌస్ ఆలం

తిమ్మాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై పలు ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కరీంనగర్ సీపీ గౌస్ అలం పేర్కొన్నారు. శుక్రవారం రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మండలంలోని అలుగునూర్ నుంచి రేణికుంట వరకు ముఖ్యంగా కొత్తపల్లి, నుస్తులాపూర్, అలుగునూర్, రేణికుంట వరకు ఉన్న రాజీవ్ రహదారిపై ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్‌లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలకు గల సాంకేతిక కారణాలను ఆయన విశ్లేషించి, తక్షణమే నివారణచర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిత్యం డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించాలని పోలీసులకు సూచించారు. హెచ్‌కేఆర్ టోల్ గేట్ నిర్వాహకులు రాజీవ్‌రహదారి వెంబడి నిత్యం పర్యటిస్తూ రోడ్లపైలైటింగ్, వారి పరిధిలో ఉండే పనులను పర్యవేక్షించాలని సీపీ ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్, తిమ్మాపూర్‌సిఐ సదన్ కుమార్, ఎల్‌ఎండి ఎస్సై శ్రీకాంత్, గన్నేరువరం ఎస్సై నరేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.7100 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7100 పలికింది. శుక్రవారం మార్కెట్‌యార్డుకు 72మంది రైతులు 659 క్వింటాళ్ల విడిపత్తి, పదిమంది రైతులు 16క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7100, కనిష్ఠ ధర రూ.5500చెల్లించి పత్తికొనుగోళ్లు చేపట్టారు. మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం, ఇన్‌చార్జి కార్యదర్శి రాజులు పత్తి కొనుగోళ్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ

బీసీ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న బీసీ నాయకులు

వేములవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు పార్టీపరంగా రిజర్వేషన్‌లతో జరపాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీసీ సంఘం నేతలు శుక్రవారం నిరసన తెలిపారు. వేములవాడ పట్టణంలోని బీసీ సంఘం కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలను ధరించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతి బాపూలే చిత్రపటాలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ఎన్నికల్లో పార్టీపరంగా రిజర్వేష న్‌లను ఉపసంహరించుకోవాలని, చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా, శాస్త్రీయంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్ర మంలో బీసీ సాధికారత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్, బీసీ సంఘం నేతలు నేరేళ్ల తిరుమల్ గౌడ్, తుపుకారి సత్తయ్య, వెంకటేష్, కడారి రాములు, చింతల కోటి రామస్వామి, మారం కుమార్, దేవయ్య, భూమయ్య, దశగౌడ్, చంద్రకాంత్, రమణ తదితరులు ఉన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

● కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెరుగుతుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జిల్లా విద్యాధికారి రామునాయక్ అన్నారు. మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో నిర్వహించిన 69 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో టోర్నమెంట్‌ను శుక్రవారం వారు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వాలన చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో ఖోఖో ఆడి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణ, పోరాట పటిమ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనడం వలన శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటామని, భవిష్యత్తులో ఏ రంగంలో ఉన్నా క్రీడలు ఇచ్చే శక్తి ధైర్యం, ఆత్మవిశ్వాసానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఎంఈవో చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, డీఈవో రామునాయక్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంస్కృత కళాశాలను శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేశ్‌కుమార్‌తో కలిసి విప్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల వసతులు, భోజనం, అల్పాహారం, సామగ్రిని పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులను కలిసి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ రాజేశ్, డీఈలు రఘునందన్, మహిపాల్‌రెడ్డి, ఏఈవో జయకుమారి, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



భోజనాన్ని తనిఖీచేస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్

కనీస వేతనాలను చెల్లించాలి

● ఎమ్మార్సీని ముట్టడించిన మధ్యాహ్న భోజన కార్మికులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలోని మధ్యాహ్న భోజన కార్మికులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రాన్ని శుక్రవారం ముట్టడించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బకాయిలు సకాలంలో అందక అప్పుల పాలవుతున్నామని వాపోయారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10 వేలు వేతనం చెల్లిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లులు చెల్లించాలని పేర్కొన్నారు. నిత్యావసర సరుకులు, కోడిగ్రుడ్లను ప్రభుత్వం సరఫరా చేయడంతో పాటు కార్మికులకు సామాజిక ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించి తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మార్సీ సిబ్బంది రోషిణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కార్మికులు గీత, మణేమ్మ, లత, మమత, కరుణ, మల్లవ్వ, స్వరూప, గంగవ్వ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట ఎమ్మార్సీని ముట్టడించిన మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రాథమిక పాఠశాల భవనం స్వాధీనం



ప్రభుత్వ పాఠశాల భవనానికి తాళం వేస్తున్న ఆర్ఐ రాజబాబు

ముత్తారం, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలంలోని కాసర్లగడ్డలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. కొన్నేళ్ళుగా పాఠశాల భవనంలో ఎలాంటి తరగతులు నిర్వహించడం లేదు. దీంతో పాఠశాల భవనంలో సంవత్సరంగా కేతిరి సారయ్య కుటుంబంతో నివాసముంటున్నాడు. గ్రామస్థుల ఫిర్యాదుమేరకు ఆర్ఐ రాజబాపుతో కలిసి కేతిరి సారయ్య కుటుంబాన్ని పాఠశాల భవనం నుంచి ఖాళీ చేయించి భవనానికి తాళం వేసి స్వాధీనం చేసుకున్నారు. ఎవరూ కూడా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను ఆక్రమించినా నివాసమున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సత్యసాయి బాబాకు 108 రకాల నైవేద్యాలు



సమర్పించిన నైవేద్యాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని సత్యసాయి సేవామందిరంలో బాబా శతజయంతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధల నడుమ 108రకాల మహా నైవేద్యాలు సమర్పించారు. ఈనెల23న స్వామి వారి జయంతి వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని సత్యసాయి సేవామందిరం సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి మహిళా విభాగం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు

- 17కిలో మీటర్లకు 18 మూలమలుపులు
- తరచూ రోడ్డు ప్రమాదాలు

మానకొండూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మండలంలోని మానకొండూర్ నుంచి అన్నారం, లలితాపూర్, పచ్చునూర్, ఊటూర్ వరకు 17 కిలోమీటర్ల దూరం ఉంది. మానకొండూర్-జమ్మికుంట ప్రధాన రహదారి పొడవునా 18మూల మలుపులు ఉన్నాయి. మానకొండూర్‌లో మూడు, అన్నారంలో ఐదు, లలితాపూర్‌లో రెండు, పచ్చునూర్‌లో నాలుగు, ఊటూర్‌లో నాలుగు చొప్పున మూల మలుపులు ఉన్నాయి. ఈ గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సులు, వందలాది ఇసుక లారీలు, ఇసుక ట్రాక్టర్లు, కార్లు, ఆటోలు ద్విచక్ర వాహనాలు ప్రతి రోజు వెళ్తుంటాయి. ఈ మూలమలుపుల వద్ద చెట్లు ఉండడంతో ఎదురెదురుగా వాహనాలు అధికస్పీడ్‌తో వెళ్తున్న సమ యంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అన్నారం గ్రామంలో, హన్మాన్ ఆలయం వద్ద ఉన్న మూలమలుపులు

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థుల ప్రతిజ్ఞ

సుల్తానాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ రోజా సూచించారు. ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో శుక్రవారం గర్రెపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు యువత భవిష్యత్‌కు గొడ్డలిపెట్టుగా మారుతుందన్నారు. వీటి వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, ఒక్కసారి అలవాటు పడితే చదువు, జీవిత లక్ష్యాలు దెబ్బతింటాయని హెచ్చరించారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ఏఎన్ఎం రమాదేవి, ఆశ కార్యకర్తలు సుజాత, కోమల, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరికలు

పెద్దపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాజ్యాధికార పార్టీలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీలో చేరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో టీఆర్‌పీలో చేరిన వారికి నాయకులు గుండేవేన స్వామి, జిల్లా అధ్యక్షుడు కాసిపేట్ ఉదయ్,ప్రధాన కార్యదర్శి చల్ల సాయికృష్ణ పటేల్ పార్టీ కండువాలు కప్పారు. నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్ధాంతాలకు, మల్లన్న పోరాటానికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను, పార్టీ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారికి దిశానిర్దేశం చేశారు. జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ అడ్లూరి గంగారాం పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలిగా నిర్మల



కాల్వశ్రీరాంపూర్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా కాసగోని నిర్మల నియామకయ్యారు. శుక్రవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగపేటకు చెందిన నిర్మల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఓదెల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, డ్రగ్స్ అనర్థాల గురించి రూపొందించిన పోస్టర్‌ను శుక్రవారం పోత్కపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆవిష్కరించారు. పోస్టర్ ద్వారా గంజాయి, డ్రగ్స్ గురించి అవగాహన కల్పించడంతోపాటు సామాజిక బాధ్యతగా పోస్టర్ ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. ఎస్‌ఐ రమేష్, కొమిరె గ్రామ మాజీ ఉప సర్పంచ్ వీర బ్రహ్మం. పల్కల నరసింహారెడ్డి, విజయలింగం పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు

గోదావరిఖని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల గురించి కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకుడు వ్యాళ్ల హరీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల సమస్యలపై రెండు పార్టీల ఎంపీలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్పొరేషన్‌లో కూల్చివేసిన దారి మైసమ్మల గుళ్లపై స్పష్టత ఇవ్వలేదని, అర్ధరాత్రి కూల్చివేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని, ఏ ఒక్క అధికారిపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రామగుండంలో అధికారులు, ప్రజాప్రతినిధుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారారని, కొంత మంది పోలీస్ అధికారులు అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తున్నారని, ప్రజల కోసం పని చేయాలే తప్ప ప్రజా ప్రతినిధుల కోసం పని చేయడం సబబు కాదన్నారు. నాయకులు ఐత శివ, అనుముల కళావతి, చంద్రమౌళి, జావెద్‌పాషా పాల్గొన్నారు.

తల్లిదండ్రుల గౌరవాన్ని పెంచే విధంగా ప్రవర్తించాలి



మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

కోల్‌సిటీటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల గౌరవాన్ని పెంచే విధంగా విద్యార్థుల ప్రవర్తన ఉండాలని, వారి కలలను నిజం చేయాలని ఏసీపీ మడత రమేష్ అన్నారు. శుక్రవారం రమేష్‌నగర్‌లోని వాసవ్య స్కూల్‌లో ఇన్‌స్పైర్ వ్యూస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు చేసే పనులకు తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితులు రావద్దన్నారు. మంచి మార్గంలో నడుస్తూ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిజం చేయడమే పిల్లల బాధ్యత అన్నారు. మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలు సమాజంలో ప్రభావం చూపుతున్నాయని, అవగాహనతో వాటిని అరికట్టేందుకు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులు టి.కార్తీక, టీ.స్ఫూర్తిలు ఏసీపీ రమేష్‌ను ఇంటర్వ్యూ చేయగా పలు విషయాలను తెలిపారు. మోటివేటర్ నడిమెట్ల ధర్మేందర్, డైరెక్టర్ బండి విక్రమ్‌వర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీపీయూఎస్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



రామగిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడిగా కల్వచర్ల గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎట్టెం వీరస్వామి ఎన్నికయ్యారు. శుక్రవారం తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం ఎన్నికలో జోన్ ఇంచార్జీ వెంకటరమణరావు అధ్యక్షతన జరిగాయి.

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం



ముత్తారం, కాల్వశ్రీరాంపూర్‌లో మత్స్యకార జెండా ఎగురవేస్తున్న ముదిరాజ్ నాయకులు

ముత్తారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండల కేంద్రంతోపాటు ఓడేడు బస్టాండ్ వద్ద ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ రజిత రఫీ, నరెడ్ల రమేష్, నరెడ్ల నంద, నరెడ్ల సంపత్, నరెడ్ల రాములు, కుక్కల చందు తదితరులున్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): పెగడపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, సంఘం ప్రధాన కార్యదర్శి పెండం సతీష్, డైరెక్టర్లు శ్రీకాంత్, నరేష్, ఓదెలు, రమేష్, ఉపాధ్యక్షుడు రాజయ్య, సదయ్య, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఐక్యతను చాటుకోవాలని మత్స్య పారిశ్రామిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాలను ఆవిష్కరించారు. భూతగడ్డ సంపత్, ముత్యాల రాజయ్య, కలవేన మహేందర్, గుండా లక్ష్మీనారాయణ, కొలిపాక నర్సయ్య, నూనే రమేష్, కొలిపాక సదయ్య, కలవేన శంకర్, సబ్బు మల్లయ్య, కలవేన రాజేశం తదితరులున్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): వడుకాపూర్‌తోపాటు ఆయా గ్రామాల్లో ప్రపంచ మత్స్యకార దినోత్సవం పురస్కరించుకొని జెండాలను ముదిరాజ్ కుల సంఘం నాయకులు ఎగురవేశారు. సంఘం నాయకులు జెట్టి సతీష్, తీగల రమేష్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సబ్సిడీ పథకాలను అందించాలన్నారు. కనకట్ల స్వామి, జెట్టి సతీష్, తీగెల రమేష్, శ్రీనివాస్, ద్యావెల్లి రాజయ్య, కనకట్ల కొండయ్య, చిక్కుడు స్వామి, అంజి పాల్గొన్నారు.

మంథనిరూరల్ , (ఆంధ్రజ్యోతి): గంగపుత్ర, బెస్త మత్స్య కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం చెరువులు కేటాయించాలని దుబ్బపల్లి గ్రామానికి చెందిన మత్స్యకార్మికులు కోరారు. తమకు ఉపాధి కల్పించడానికి గ్రామంలో చేపల చెరువులు, సొసైటీని ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు తోకల మల్లేష్, లింగయ్య, చంద్రయ్య, మేడి నర్సయ్య, కూనరపు సంతోష్, మహిళలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

(5వ పేజీ తరువాయి)

పర్యవేక్షణ లోపం వల్ల షెడ్లు మూలనపడ్డాయి. కొవిడ్ సమయంలో చెత్తను శుభ్రం చేసిన పంచాయతీలు, ఆ తర్వాత క్రమంగా వీటిని నిర్లక్ష్యం చేశాయి. అప్పటి నుంచి చాలా షెడ్లు మూతపడ్డాయి.

క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం

వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి

సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలు నిర్వహించాల్సి ఉంటుంది. వీటిని ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు తడి, పొడి చెత్త వేరు చేసిన కంపోస్టు ఎరువును తయారు చేసేలా పర్యవేక్షణ చేయాలి. ఇలా షెడ్లను నిరూపయోగంగా వదిలేయ వద్దు. ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకొంటాం.

మాతాశిశు ఆసుపత్రిలో గైనిక్ సేవలు

మంథని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కలెక్టర్ కోయ శ్రీహర్ష చొరవతో మంథని మాతా శిశు ప్రభుత్వ ఆసుపత్రిలో గైనిక్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు జిల్లా సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ శుక్రవారం తెలిపారు. మంథని ప్రాంతంలోని గర్భిణీలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎంపీ పరామర్శ

ధర్మారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ నారా ప్రభాకర్ కుటుంబాన్ని ఎంపీ గడ్డం వంశీకృష్ణ శుక్రవారం పరామర్శించారు. ప్రభాకర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ప్రభాకర్ హఠాన్మరణం పార్టీకి తీరని లోటన్నారు. నాయకులు నార బ్రహ్మయ్య, కాడె సూర్యనారాయణ, అజయ్‌పాల్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, కాంసాని ఎల్లయ్య, ఉత్తం రాజయ్య ఉన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

ముత్తారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని వికాస తరంగిణి చీఫ్ కోఆర్డినేటర్ భాస్కర్‌రావు సూచించారు. అడవి శ్రీరాంపూర్ ప్రాథమిక పాఠశాలలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. మహిళలకు గర్భాశయముఖ, రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించి వైద్యులు అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావు, పెద్దపల్లి వైద్యురాలు లీలావతి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, పిఎసిఎస్ చెర్మన్ అల్లాడి యాదగిరిరావు, వికాస తరంగిణి సభ్యులు సుజాత, శ్రీదేవి, లక్ష్మి, సువర్ణ, వాణి, మానస, స్వప్న, తోడూరి స్వప్న, అన్నపూర్ణ, లక్ష్మి, శోభ, అనిత తదితరులున్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత

కోల్‌సిటీటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లోని 12వ డివిజన్‌కు చెందిన దివ్యాంగుడు బోయిన చిరంజీవికి సివిల్ కాంట్రాక్టర్ కొల్లూరి విజేందర్ అందించిన బ్యాటరీ వీల్‌చైర్‌ను శుక్రవారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డు రవీందర్ అందజేశారు. రవీందర్ మాట్లాడుతూ పుట్టుకతో దివ్యాంగుడైన చిరంజీవిని బయటకు తీసుకువెళ్ళాలంటే ఇబ్బందవుతుందని తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకురాగా కాంట్రాక్టర్ విజేందర్‌ను కోరగా బ్యాటరీ వీల్‌చైర్‌ను అందించారని తెలిపారు. బిక్షపతి, చీకట్ల లక్ష్మయ్య, నంద సాంబ, కొమురయ్య, బండ సమ్మన్న, మేకల నవీన్, సందవేణ కుమార్, విజేందర్, నంద శివ, రాజు, రాజు, కుంచం శ్రీకాంత్, పవన్, రాజు, సాగర్, సంపత్, లక్కీ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒక లక్ష్యంతో పయనిస్తే లక్ష్యసాధన మిమ్ములను వెతుక్కుంటూ వస్తుందని మాజీ ఎమ్మెల్యే, ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. రాఘవపూర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల, బీటెక్ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే ఆగమనం 2025 కార్యక్రమానికి ఆయన హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ట్రినిటీ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు ఏ ఒక్కరు కూడా ఖాళీగా ఉండరని, దానికోసం రానున్న రోజుల్లో మెగా ఉద్యోగ మేళా నిర్వహించి ప్రతి విద్యార్థి ఉద్యోగిగా మారేలా దోహదపడదామని చెప్పారు. రానున్న రోజుల్లో అటానమస్ కాలేజీగా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. అనంతరం అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు, పరిశ్రమల్లో బీటెక్ విద్యార్థుల పాత్ర, అవకాశాలపై వివరించారు. బీటెక్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ మణి గణేష్, ఏవో సురేష్,డా. నటరాజన్ ,రాజిరెడ్డి, చొప్పరి వంశీ, హెచ్‌ఓడీ వంశీ, హెచ్‌ఓడీ ప్రభాకర్,హెచ్‌ఓడీ స్వాతి, హెచ్‌ఓడీ పద్మిని, హెచ్‌ఓడీ డాక్టర్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభాలు



మాట్లాడుతున్న చైర్మన్ కొత్త శ్రీనివాస్, బుర్హాన్‌మియాపేటలో మొక్కలు నాటిస్తున్న అధికారులు

మంథని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందని పీఏసీఎస్, ఏఎంసీ చైర్మన్లు కొత్త శ్రీనివాస్, కుడుదుల వెంకన్నలు వెల్లడించారు. ఆయిల్ పామ్ సాగుపై పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయిల్‌పామ్ 30 ఏళ్ళ వరకు రైతులకు ఆదాయాన్ని ఇస్తుందన్నారు. పంటల మార్పిడితో అనేక లాభాలు ఉంటాయన్నారు. టీజీఈఆర్‌సీ మెంబర్ శశిభూషణ్ కాచే మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంట సాగులో భూ యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. అధికారులు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): రైతులు పంట మార్పిడి చేయాలని మండల వ్యవసాయ అధికారి ఉమాపతి అన్నారు. శుక్రవారం బుర్హాన్‌మియాపేట్‌లోని గట్ల సంపత్‌రెడ్డి ఆరు ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటించారు. ఈ ప్రాంత రైతులు అధికంగా వరిపంట సాగుకు అలవాటు పడ్డారని, మోతాదుకు మించి పురుగు మందులు వాడటం వల్ల సారవంతమైన భూమి దెబ్బతింటుందని తెలిపారు. ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ సాగుకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందిస్తుందన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసుకుని తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించాలన్నారు. గణేష్, మహేష్, అభిలాష్ పాల్గొన్నారు.

మండల కేంద్రంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

కమాన్‌పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శిక్షకురాలు సాధినేని ప్రియాంక పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇందులో పిల్లల సహజ సామర్థ్యాలను గుర్తించి వాటిని పెంచేలా బోధన విధానాలను అవలంబించాలని తెలిపారు. అధ్యాపకుల పాత్ర కీలకమని, ప్రతి విద్యార్థి వ్యక్తిగత ప్రతిభను వెలికితీసేలా పాఠశాలల్లో అనుకూల విద్యావాతావరణం సృష్టించాలన్నారు.

హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకం

మంథని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి మాడ్వి హిడ్మా, ఆయన సతీమణి రాజే, ఏవోబీ రాష్ట్ర కమిటీ సభ్యుడు టెక్ శంకర్‌తోపాటు పలువురిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారని మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఆరోపించారు. శుక్రవారం అభయ్ పేరిట పత్రికా ప్రకటన విడుదల చేశారు. విజయవాడలో చికిత్స పొందుతున్న హిడ్మా, రాజేతోపాటు మరి కొందరిని ఈనెల 15న కేంద్ర హోం మినిస్ట్రీ డైరెక్షన్‌లో ఆంధ్ర ఎస్‌ఐబీ వారు పట్టుకొన్నారన్నారు. హత్య చేసి మారెడుమిల్లి ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారని వెల్లడించారు. టెక్ శంకర్ తోపాటు మరికొందరిని పట్టుకొని హత్య చేసి రంపచోడవరం ఏరియాలో ఎన్‌కౌంటర్ జరిగిందని పేర్కొన్నారన్నారు. ఈ హత్యాకాండలకు వ్యతిరేకంగా ఈనెల 23న దేశవ్యాప్తంగా నిరసన దినంగా పాటించాలని పిలుపునిచ్చారు.

వార్డు అధికారులు సన్నద్ధంగా ఉండాలి

కోల్‌సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమైన సేవలందించడానికి వార్డు అధికారులు సన్నద్ధంగా ఉండాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ మారుతిప్రసాద్ అన్నారు. శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆస్తి పన్ను వసూళ్ల శాతం పెరగడానికి మరింత శ్రద్ధ చూపాలన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఎస్ఈ గురువీర, ఈఈ వీవీ రామన్, ఏసీ వెంకటేశ్వర్లు, సెక్రటరీ ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

సైన్స్‌తో నిత్య జీవితంలో సమస్యల పరిష్కారం



ధర్మారం, కమాన్‌పూర్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ధర్మారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాలలో నేర్చుకునే సైన్స్ అంశాలు నిత్య జీవితంలో సమస్యలు పరిష్కరించుకునేందుకు ఉపయోగకరంగా ఉంటాయని ఎంఈవో పి.ప్రభాకర్ అన్నారు. శుక్రవారం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టెస్ట్‌లో మాట్లాడారు. విద్యార్థులు సైన్స్ ద్వారా సమస్యల పరిష్కారంతోపాటు కొత్త అంశాల అన్వేషణ చేయవచ్చని తెలిపారు. జడ్పీ హెచ్ఎస్ నందిమేడారం విద్యార్థులు ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇంచార్జ్ హెచ్ఎం మాలతిలతతో కలిసి ప్రభాకర్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు కృష్ణమోహన్, రాజునాయక్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై పోటీలను నిర్వహించారు. కమాన్‌పూర్, రొంపి కుంట, జూలపల్లి, నాగారం ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటారు. నజీఫా, చర్మిస్తా, అంజుమ్ సుల్తానాలు గెలుపొందగా మండల విద్యాధికారి విజయ్‌కుమార్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ నెల 28న పెద్దపల్లిలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. టీచర్లు రాజేశ్వరరావు, సతీష్, రజిత కుమారి, శంకర్, శ్రీనివాస్, మల్లేష్ పాల్గొన్నారు.

అందుబాటులో లేని వార్డెన్లను సస్పెండ్ చేయాలి

కోల్‌సిటీటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో అందుబాటులో లేని వార్డెన్లను సస్పెండ్ చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణకుంట్ల ప్రీతం, నాయకులు అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. వార్డెన్స్ విధులకు గైర్హజరు అవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం, నాణ్యమైన భోజనం అందించకుండా విద్యార్థుల కడుపు మాడుస్తున్నారని ఆరోపించారు. వసతిగృహాలను ఆకస్మికంగా సందర్శించాలని కోరారు. హేమంత్, గొడిసెల ప్రణీత్, కట్ల అభినయ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజెప్పేలా కార్యకర్తలు పని చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండేటి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డిలు సూచించారు. శుక్రవారం పట్టణ కాంగ్రెస్ నాయకులు సమావేశం తెలంగాణ చౌరస్తా ప్రాంగణంలో జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికలకు క్యాడర్ సిద్ధంగా ఉండాలని, డివిజన్‌లలో పార్టీ పటిష్టతపై దృష్టి సారించాలని సూచించారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలో అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించాలని సూచించారు. శంకర్‌నాయక్, సాగంటి శంకర్, చక్రపాణి, మార్కరాజు, తిరుపతిరెడ్డి, రేశవేని కేశవులు, అనుము రాములు, సారయ్యనాయక్ పాల్గొన్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌పై మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు చేస్తున్నాడని యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరికి మహేష్ ప్రకటనలో పేర్కొన్నారు. ఖని వ్యాపార సముదాయాన్ని సుందరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 32 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. రోడ్డు విస్తరణకు వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ గదుల నిర్మాణం జరుగుతున్నట్టు తెలిపారు. కేవలం రాజకీయ కోణంలో మాజీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్టు మహేష్ పేర్కొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు రగ్గుల పంపిణీ

సుల్తానాబాద్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు శుక్రవారం రాత్రి రగ్గులను అందించారు. విద్యార్థులు ఇబ్బందులను గుర్తించిన జిల్లా యంత్రాంగం స్పందించినట్లు కాలేజ్ హాస్టల్ సంక్షేమ అధికారి మేకల అంజయ్య తెలిపారు. ప్రస్తుతం 70 మంది విద్యార్థులు ఉండగా, వారందరికి రగ్గులను అందించినట్లు ఆయన తెలిపారు. హాస్టల్ విద్యార్థులు చలి కారణంగా ఇబ్బందులు పడుతున్నారనే సమాచారంతో కలెక్టర్, డీఎస్‌డీవో పంపించినట్లు తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహ విద్యార్థులకు తహసీల్దార్ జగదీశ్వర్‌రావు దుప్పట్లను అందించారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో చలి దుస్తులతోపాటు దుప్పట్లను శుక్రవారం హాస్టల్‌కు వెళ్లి వారికి అందించారు. గృహ సంక్షేమ అధికారి సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.



నూతన యంత్రాలు కొనుగోలు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3లో కాలం చెల్లిన భారీ యంత్రాలతో ప్రమాదాలకు అవకాశం ఉన్నదని, యాజమాన్యం కొత్త యంత్రాలను కొనుగోలు చేయాలని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మేనేజర్ భరత్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్ మాట్లాడారు. ఓసీపీ-3 ప్రాజెక్టు అవసరాలకు సరిపడా డోజర్లు, గ్రేడర్లు, డీజిల్ బోజర్లు కొనుగోలు చేయాల్సి ఉన్నా యాజమాన్యం పాత వాటితో పనులు చేయిస్తున్నట్టు తెలిపారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్టు తెలిపారు. 24 డోజర్లు ఉన్నా అందులో నాలుగు మాత్రమే పూర్తి స్థాయిలో పని చేస్తున్నాయని, మిగిలిన డోజర్లకు మరమ్మతులు చేయాల్సి ఉన్నట్టు పేర్కొన్నారు. షావల్స్ డంపర్ల మెయింటనెన్స్‌లో అవసరమైన విడిభాగాలు సమయానికి అందడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రాజెక్టు అవసరాలకు సరిపడా యంత్రాలను కొనుగోలు చేయాలని, నిర్వహణ లోపం లేకుండా విడిభాగాలు అందుబాటులో ఉంచేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ప్రవీణ్ డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంపత్, రాంప్రసాద్, వినేష్, శివకుమార్, రాజేందర్ ఉన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలుపుతున్న హెచ్ఎంఎస్ జాగృతి నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి భవన్ ముట్టడికి వెళ్ళిన నాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఓసీపీ-3 ఎస్అండ్‌డీ సెక్షన్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ మాట్లాడారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు సమస్యలు పరిష్కరించడంలో విఫలమైనట్టు ఆరోపించారు. ఒక్క గని ప్రారంభించలేని చేతగాని స్థితిలో రెండు సంఘాలు ఉన్నాయని, మెడికల్ బోర్డు రద్దు చేసే కుట్ర జరుగుతున్న విషయం తెలిసినా సంఘాలు యాజమాన్యం మీద ఒత్తిడి తేవడంలేదన్నారు. 150, 200 మస్టర్ల నిబంధనపై ఒక్క మాట మాట్లాడకుండా యాజమాన్యానికి సహకరిస్తూ కార్మికులకు అన్యాయం చేశాయని ఆరోపించారు. పెర్క్స్‌పై ఐటీని రీయింబర్స్, సొంత ఇంటి పథకం అమలు చేయిస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయో గెలిచిన సంఘాలు కార్మికులకు సమాధానం చెప్పాలని రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. కార్మికుల కష్టార్జితాన్ని ప్రభుత్వం దారి మళ్ళిస్తున్నా, విద్యుత్ సంస్థల నుండి బకాయిలపై గెలిచిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు ఎందుకు స్పందించడంలేదో కార్మికులు ఆలోచించాలని రియాజ్ కోరారు. డిమాండ్లపై యాజమాన్యాన్ని ప్రశ్నించేందుకు వెళ్ళిన హెచ్ఎంఎస్ నాయకులను పోలీసులతో అరెస్టు చేయించడం కార్మికుల గొంతునొక్కడమే అని, ఇప్పటికైనా గెలిచిన సంఘాల నిజస్వరూపాన్ని కార్మికవర్గం అర్థం చేసుకోవాలని కోరారు. నిరసనలో ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ దావు రమేష్, నాయకులు రత్నాకర్‌రెడ్డి, నవీన్, నరేష్, సురేష్, పాష పాల్గొన్నారు.

యూనియన్ల పనితీరును కార్మికులు గుర్తించాలి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాలు చేసిన పనులను కార్మికులు గుర్తించాలని టీబీజీకేఎస్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఓసీపీ-3 బేస్‌వర్క్‌షాప్ కార్మికులను కలసి సమస్యలు తెలుసుకున్నారు. వారసత్వ ఉద్యోగాలను టీబీజీకేఎస్ సాధించిందని, మెడికల్ బోర్డు నిర్వహించి వారసులకు ఉద్యోగాలు వచ్చేలా చేసిన ఘనత తమ యూనియన్‌కు దక్కుతుందన్నారు. ప్రస్తుతం మెడికల్ బోర్డు నిర్వహణ, మస్టర్ల పేరిట నిబంధనలను గమనించాలని కోరారు. ప్రస్తుతం గెలిచిన సంఘాలు కార్మికుల సమస్యలను పట్టించుకునే స్థితిలో లేవని తెలిపారు. కమలాకర్, ముక్కెర రమేష్, బెజ్జ రమేష్ పాల్గొన్నారు.

ఈఎస్ఐపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 పరిధిలోని కాంట్రాక్టర్లతో యాజమాన్యం ఈఎస్ఐ (ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ యాక్టు)పై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. శుక్రవారం జీఎం ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో ఈఎస్ఐ బ్రాంచి మేనేజర్ కిరణ్‌కుమార్ మాట్లాడారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఈఎస్ఐ ద్వారా లభించే లాభాలు, సదుపాయాలను వివరించారు. కాంట్రాక్టు ఉద్యోగులకు వీటిని అమలు చేయాలని సూచించారు. ఉద్యోగుల సామాజిక భద్రత, వైద్య సదుపాయాలు, కుటుంబ సంక్షేమం దృష్ట్యా ఈఎస్ఐ చట్టం అమలు చేయడం కీలకమని పేర్కొన్నారు. ఆర్జీ-2 పరిధిలోని కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.